మత సామరస్యానికి ప్రతీక.. తాతయ్య దర్గా

- నేటి నుంచి మూడు రోజుల పాటు ఉరుసు
- గంధోత్సవంతో ప్రారంభమై.. ఆర్కెస్ట్రాతో ముగింపు
- మూడు రోజుల పాటు అలరించనున్న కార్యక్రమాలు


శ్రీరంగరాజుపల్లి దర్గాలో తాతయ్య స్వామి సమాధి


తాతయ్యస్వామి దర్గా

పరిగి : శ్రీరంగరాజుపల్లి జయమంగళి నదీ తీరాన ఉన్న తాతయ్య దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఎన్నో దశాబ్దాలుగా ప్రముఖ సందర్శనీయ క్షేత్రంగా వెలుగొందుతోంది. వాడుకలో తాతయ్య స్వామిగా పిలువబడుతున్నా... స్వామి అసలు పేరు హజరత్ సయ్యద్ షేక్ బుడేన్‌షా ఖాదరి వలీ. అయితే తాతయ్యస్వామి గానే అత్యధిక ప్రజాదరణ పొందిన దర్గాకు చాలా గొప్ప చరిత్రే ఉంది. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి తాతయ్య స్వామికి భక్తులు వస్తుంటారు. ఏటా హోలీని పురస్కరించుకొని మూడు రోజుల పాటు ఉరుసు నిర్వహించడం ఆనవాయితీ.

తాతయ్య స్వామి చరిత్ర ఇదీ...

కర్ణాటక రాష్ట్రం రామ్‌నగర్ జిల్లాలోని బిడిది అనే గ్రామానికి చెందిన తాతయ్య చిన్న నాటి నుంచే ఆధ్యాత్మిక చింతనతో మెలిగేవారు. తల్లి బావక్కయ్య, తండ్రి బిడిది బాబన్న అనే దంపతులకు జన్మించిన కుమారులలో రెండో సంతానంగా జన్మించిన ఆయన జీవితాంతం వివాహం చేసుకోకుండా సన్యాసి జీవితాన్ని గడిపారు. తన పదో యేట నుంచే సొంత ఊరిని వదిలి వివిధ ప్రాంతాల్లో తిరగాడి తన దైవాధి తత్వాలతో బోధనలు చేశారు. చివరి దశలో తన పూర్వీకుల స్వగ్రామం శ్రీరంగరాజుపల్లికి చేరారు. తన ఆధ్యాత్మిక బోధనలు, తత్వాలతో భక్తులకు ఉపదేశం చేసేవారు. తన మహిమలను చూపేవారు. సుదూర ప్రాంతంలో నదీ ప్రవాహం వస్తోందని ముందస్తుగానే తెలిపే అంతటి మహిమాన్వితుడని గ్రామస్తులు చెబుతుంటారు. తనకు తొంభైయవ యేట 1965లో సమాధి అయ్యారు. నాటి నుంచి దర్గాకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగింది. ప్రతి పౌర్ణమీ, అమావాస్యల రోజున గ్రామస్తులు దర్గా వద్ద పెద్ద ఎత్తున చేరి భజనలు చేస్తారు.

ఏటా ఉరుసు ఉత్సవాలు..

1968 సంవత్సరం నుంచి మొదలైన వార్షిక ఉరుసు ఏటా హోలీ పండుగ (కదిరి పున్నమి) రోజు నుంచి మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను దర్గా వెల్ఫేర్ ట్రస్టుల సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు దర్గాకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లిస్తారు.

వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉరుసు..

దర్గా ఉరుసు ఉత్సవాలు గ్రామస్తులు, దర్గా వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మార్చి 14 శుక్రవారం రాత్రి 10 గంటలకు గంధోత్సవం జరుగుతుంది. జానపద నృత్యాలతో, వీరగాసేల విన్యాసాలతో విద్యుత్ దీపాలంకరణ చేసిన వెండి రథంపై గంధాన్ని ఊరేగిస్తారు. అదే రోజు సాయంత్రం నుంచి శనివారమంతా అన్నదానం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు ఖవ్వాలీ జరుగుతుంది. చివరి రోజు ఆదివారం రాత్రి 9 గంటలకు ఆర్కెస్ట్రా జరుగుతుంది.

శ్రీరంగరాజుపల్లికి చేరుకోవడం ఇలా...

తాతయ్య గుడి దర్గాతో ప్రాముఖ్యత సంపాదించుకున్న శ్రీరంగరాజుపల్లి పరిగి మండల కేంద్రానికి 4 కి.మీల దూరంలో ఉంది. అదేవిధంగా 12 కి.మీల దూరంలో ఉన్న హిందూపురం నుంచి శ్రీరంగరాజుపల్లికి ఆర్టీసీ బస్సు, ఆటోలు కూడా పెద్ద మొత్తంలో తిరుగుతూ ఉంటాయి.


తాతయ్య స్వామి చిత్రపటం

క్లుప్తంగా

సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సర్వే


ఆర్.అనంతపురంలో సర్వే నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

మడకశిర రూరల్: మండలంలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా గురువారం విద్యార్థులు ఆర్.అనంతపురంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రజల జీవన విధానం, భూములు, పండించిన పంటలు, వ్యవసాయ పరికరాలు, ఆదాయ, వ్యయ, గ్యాస్ వినియోగం, తాగునీటి లభ్యత, ఆరోగ్య సమస్య, అక్షరాస్యత, విద్యార్హతలు, ఆహారపు అలవాట్లు, సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సర్వే చేశారు. కళాశాల అసోసియేట్ డీన్ సరోజినీదేవి మాట్లాడుతూ ఈ సమాచారం ద్వారా సంపూర్ణ గ్రామీణ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు మురళీకృష్ణ, మంజుల, సర్పంచ్ అంజినమ్మ, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

'యువత పోరు విజయవంతం'

మడకశిర: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన యువత పోరు కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు యువత పోరు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు అభిమానులు కూడా యువతపోరులో పాల్గొని విజయవంతం చేశారన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందనడానికి యువత పోరు విజయవంతం కావడమే నిదర్శనమన్నారు.

నేడు నృసింహుడి 'బ్రహ్మ రథోత్సవం'


వేడుకలకు సిద్ధంగా ఉన్న రథం

పావగడ: పట్టణంలోని తుమకూరు రోడ్డులో కనుమల మధ్య వెలసిన కణివె లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటలకు 70వ కణివె లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి సమితి పదాధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రథోత్సవం సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ధర్మకర్తలు భక్తులకు అన్నదాన శిబిరాలు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ బారిన పడకుండా భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని దేవదాయ శాఖ అధికారులు సూచించారు.

సాంఘిక దురాచారాలు మానుకోండి


మాట్లాడుతున్న చేతన్ కుమార్

పావగడ: సాంఘిక దురాచారాలు మానుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ డీడీ చేతన్ కుమార్ సూచించారు. తాలూకాలోని బ్యాడనూరు గొల్లరహట్టిలో గురువారం నిర్వహించిన పోషణ్ అభియాన యోజన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గొల్లరహట్టిలో అనిష్ఠ పద్ధతులు, బాల్య వివాహాలు, చిన్న వయసులోనే గర్భం దాల్చడం వంటి సాంఘిక దురాచారాలకు దూరంగా ఉండాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ యోజనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నిరూపణాధికారి దినేశ్ మాట్లాడుతూ పసిబిడ్డలు, పోషణ్ అభియాన యోజన, బాలింతల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మూఢ నమ్మకాల వల్ల నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్థానిక సీడీపీఓ సునీత, రాజానాయక్, శశిధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

అగళి: తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ పద్మ, ఏపీఓ శివన్న తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అమృతవాలి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


పరికరాలను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ లబ్ధిదారులకు సూచించారు. స్థానిక గురుభవన్ మైదానంలో గురువారం నిర్వహించిన మోటారు పంపు పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్‌సీపీ, టీఎస్‌పీ తో పాటు ఎమ్మెల్యే సహాయ ధనం నుంచి మంజూరైన గంగా కళ్యాణి నీరావరి పథకం కింద తవ్విన బోర్లకు చెందిన మోటారు పంపు, విద్యుత్ పరికరాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ గ్రామీణ చేతి వృత్తుల పరిశ్రమల శాఖ నుంచి ఎంపికైన క్షురకులు, రజకులు, వడ్రంగి తదితర చేతి వృత్తుల కార్మికులకు ఉచిత పరికరాలు అందించారు. అదేవిధంగా బీఈఓ కార్యాలయంలో బీఈఓ ఇంద్రాణమ్మ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో 2023–24 ఏడాదిలో అధిక మార్కులు సాధించిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు అందించారు. గురుభవన్‌లో జరిగిన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, ఎలక్ట్రీషియన్లకు టూల్ కిట్లను అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వెంకటరమణప్ప, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగిన పింఛన్ల రీవెరిఫికేషన్


రీవెరిఫికేషన్ కోసం క్యూకట్టిన లబ్ధిదారులు

మడకశిర: పట్టణంలో ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండో రోజు కూడా గురువారం దివ్యాంలాంగుల పింఛన్లను రీ వెరిఫికేషన్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 52 మంది పింఛన్లను పరిశీలించారు. రీ వెరిఫికేషన్ పేరుతో తమను ఇబ్బందులు పెట్టడం సరికాదని దివ్యాంగులు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగు సీసీలు మంజునాథ్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీదేవి కల్యాణోత్సవం


రొళ్లలో లక్ష్మీదేవికి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి లక్ష్మీదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామున నరసింహస్వామి సమేతంగా లక్ష్మీదేవి అమ్మవారికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. ఉదయాన్నే వేదపండితులు ఆలయ ఆవరణలో కలశ స్థాపన చేసి యోగీశ్వర ఆరాధన కార్యక్రమం నిర్వహించి మహామంగళారతి చేశారు. అనంతరం లక్ష్మీదేవి సమేతంగా నరసింహస్వామిని ఉత్సవ విగ్రహాలను ఉయ్యాలలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా వేదపండితులు లక్ష్మీదేవి అమ్మవారికి కల్యాణం జరిపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా సమీపాన కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. కాగా శుక్రవారం బ్రహ్మ రథోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

కమనీయం.. లక్ష్మీనారసింహుడి కల్యాణం

చిలమత్తూరు: మండలంలోని కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీదేవీ భూదేవి సమేత లక్ష్మీనారసింహస్వామి ఉత్సవ మూర్తులను మండపంలో కొలువుదీరగా అర్చకులు కల్యాణం జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు దివాకర్‌రెడ్డి అన్నదానం చేశారు.

నేడు రథోత్సవం

ఏటా కదిరి పౌర్ణమిని పురస్కరించుకుని అత్యంత వైభవంగా నిర్వహించే లక్ష్మీనారసింహుడి బ్రహ్మరథోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు.


లక్ష్మీనారసింహుడికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

రహదారి భూ సేకరణపై గ్రామసభ


భూసేకరణ కోసం రెవెన్యూ గ్రామ సభ నిర్వహిస్తున్న ఆర్‌డీఓ సువర్ణ

గోరంట్ల: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నుంచి హిందూపురం వరకు 716 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అదనపు భూసేకరణకు కోరేవాండ్లపల్లిలో ఆర్‌డీఓ సువర్ణ ఆధ్వర్యంలో గురువారం రైతులతో గ్రామ సభ నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణానికి గౌనివారిపల్లి రెవెన్యూ పొలంలో మరో 3 ఎకరాల పొలం అవసరమైనట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూములు కోల్పోతున్న రైతులతో నష్ట పరిహారం పంపిణీపై గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాం పొలానికి రూ.22 లక్షలు చొప్పున ప్రభుత్వం పరిహారం కింద మంజూరు చేసే విధంగా ఆర్‌డీఓ సువర్ణ రైతులతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. రైతులు అంగీకరించారు.

ఆక్రమణల తొలగింపు

బూదిలిలో జాతీయ రహదారి 342 నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న కొందరు ఇళ్ల ఆక్రమణలను ఆర్‌డీఓ సువర్ణ, పోలీసులు,రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. జాతీయ రహదారి బూదిలి ఎస్సీ కాలనీ మీదుగా వెళ్తుంది. ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం అందించారు. గురువారం ఆక్రమణలు తొలగించడంతో రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగాయి. కార్యక్రమంలో జాతీయ రహదారుల డీఈ గిడ్డప్ప, తహసీల్దార్ మారుతీ ప్రసాద్ , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ డాక్టర్ శాంతాలక్ష్మి

అమరాపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గుడిబండ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ సీడీపీఓ డాక్టర్ శాంతాలక్ష్మి సూచించారు. గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీ మల్లికార్జున, సీడీపీఓ శాంతాలక్ష్మి, ఉపాధ్యాయుడు చంద్రప్ప, ఏటీఎల్ మీనాక్షి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు విద్య, ఉద్యోగ, వ్యాపార, చేతి వృత్తులు, రాజకీయంగా ఎదగాలన్నారు. ఆడ పిల్లలు చదువుకుంటే కుటుంబం, సమాజం బాగుపడుతుందన్నారు. అనంతరం ఉత్తమ మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమలమ్మ, సీడీసీ సభ్యులు జేకే మూర్తి మహిళలు పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై విద్యార్థినులకు అవగాహన


కరాటేపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని హాలుకూరు సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు గురువారం కరాటే మాస్టర్ రామచంద్ర ఆత్మరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆత్మ రక్షణ కోసం యోగా, కరాటే నేర్చుకోవాలన్నారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ వీణమ్మ, పీడీ రోజా, పీఈటీ భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరు జెర్సీ ఆవులు అపహరణ

గోరంట్ల: మండల పరిధిలోని బూచేపల్లికి చెందిన వెంకటేశు అనే రైతుకు చెందిన ఆరు జెర్సీ ఆవులు ఫిబ్రవరి 22న రాత్రి అపహరణకు గురైనట్లు సీఐ శేఖర్ తెలిపారు. బాధితుడు వెంకటేశు ఫిర్యాదు మేరకు బత్తలపల్లి మండలం చిన్నరాయపట్నంకు చెందిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ


అట్టలు అందజేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: పదోతరగతి పరీక్షలు రాయనున్న 210 మంది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడి సి.సి.హరి ఆధ్వర్యంలో విద్యాసామగ్రి గురువారం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయుడు నంజుండ పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

సోమందేపల్లి: కేజీబీవీ విద్యార్థినులకు వైద్య సిబ్బంది గురువారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన కంటి పరీక్షల్లో దృష్టి లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి కంటి అద్దాలు అందించినట్లు వైద్యుడు ఓంకార్ తెలిపారు. హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర, ఎస్‌ఓ అనీత, ఏఎంఎలు పాల్గొన్నారు.

నిరవధికంగా ఇఫ్తార్ విందు

పెనుకొండ: స్థానిక బాబయ్య దర్గాలో నిరవధికంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నారు. దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా ఏటా రంజాన్ మాసంలో ఉపవాసం ఉంటున్న వారికి రెండు పూటలా (సేహ్రీ, ఇఫ్తియార్) భోజనాలు ఏర్పాటు చేశారు. ఉపవాసం ఉంటున్న ముస్లింలు ఇఫ్తార్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఇంటర్ పరీక్షలకు 102 మంది గైర్హాజరు

మడకశిర: నియోజకవర్గంలో గురువారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 102 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. మడకశిరలో నాలుగు కేంద్రాలు, అగళి, గుడిబండ, అమరాపురంలో ఒక్కో కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 2,092 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 1,990 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మొత్తం 102 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని వారు తెలిపారు.

లేపాక్షి ప్రాముఖ్యతపై ప్రాథమిక నివేదిక

లేపాక్షి: యునెస్కో వారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కించుకునేందుకు లేపాక్షి వీరభద్రాలయానికి అన్ని అర్హతలు ఉన్నాయని తెలుపుతూ తయారు చేసిన ప్రాథమిక నివేదికను సీఎం చంద్రబాబుకు అందజేసినట్లు పర్యాటక నిపుణుడు మైనాస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి యునెస్కో కట్టడాల జాబితాలో చోటు దక్కితే ఆ ప్రాంత రూపరేఖలు మారిపోతాయన్నారు. ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. నిపుణుల సంఘాన్ని నియమిస్తే యునెస్కో సంప్రదింపులు జరుపడానికి తొలి అడుగు పడుతుందని పేర్కొన్నారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు.

ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	36.0
పెనుకొండ	38.0
మడకశిర	36.0

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ


సరస్వతీ పూజ అనంతరం ఉపాధ్యాయులతో విద్యార్థులు

రొద్దం: మండలంలోని దొడగట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సుజాత ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గురువారం సరస్వతీ పూజ నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని చదువుల తల్లిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిమ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం కూటమి నాయకులు జిమ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలోని కళాశాల క్రీడా మైదానం ఆవరణలో జిమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీ శాఖామాత్యులు సవిత కూటమి నాయకులకు సూచించింది. నాయకులు శ్రీనివాసులు, ప్రసాద్, సిద్ధయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా చంద్రమ్మ పండుగ వేడుకలు


భక్తిగీతాలు ఆలపిస్తున్న మహిళలు

మడకశిరరూరల్: పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో మూడో రోజు బుధవారం రాత్రి మహిళలు ముగ్గులు వేసి చంద్రమ్మ పాటలు పాడుతూ చంద్రమ్మ పండుగ వేడుకలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు రాత్రి సమయంలో చంద్రమ్మ పాటలు పాడి శుక్రవారం పౌర్ణమి రోజు రాత్రి సాగినంపి పండుగ చేసుకుంటారు. వర్షాలు కురిసి పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని చంద్రమ్మ పండుగను చేసుకుంటామని మహిళలు తెలిపారు.

ప్రసారాల్లో అంతరాయం తలెత్తకుండా చూడాలి

హిందూపురం: ఏపీ ఫైబర్ నెట్ ప్రసారాల్లో అంతరాయం తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హిందూపురం ఏపీ ఫైబర్ కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రోజు గంటల కొద్దీ సిగ్నల్స్ ఆగి పోతుండటంతో కస్టమర్లు తమ తప్పు లేకున్నా వివిధ రకాలుగా నిందిస్తున్నారని వాపోయారు. రూ.59 చార్జ్ చేస్తున్న దాన్ని తీసి వేసి అదనపు భారం తగ్గించాలని కోరారు. సమావేశంలో హెచ్‌సీఏ ఏపీ ఫైబర్‌నెట్ కెబుల్ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ వెంకటేశులు, ఖలీల్, శంకర్ లాల్, గోపాల్, అశోక్, మోహన్, టెక్నీషియన్ శివ, శంకరప్ప, మహేష్, ఇర్ఫాన్, పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనుకొండ: ఆల్విన్ కాలనీలో వెలసిన షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. కాలనీలో సత్యసాయి, షిర్డీసాయి భజన మందిరం ఏర్పాటు చేసి నేటికి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. విశ్వశాంతి కోసం నగర సంకీర్తన నిర్వహించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

సోమందేపల్లి: మండలంలోని నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. తొగట వీర క్షత్రీయ సంఘం అధ్యక్షుడు హరితోపాటు కియా అనుబంధం పరిశ్రమల నిర్వాహకులు రూ.10 వేలు విలువ చేసే పది కెమెరాలు అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీధి దీపాల ఏర్పాటు

రొళ్ల: మండలంలోని రొళ్లగొల్లహట్టి, గొల్లహట్టితండాలో గురువారం మురళి పాఠశాల ఏఒ యోగానంద్ సొంత ఖర్చులతో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. రెండు గ్రామాల్లో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో విషపురుగుల బెడదతో ఇబ్బందులు పడేవాళ్లని ప్రజలు వాపోయారు. దీనికితోడు రెండు గ్రామాలకు ఆనుకుని రిజర్వ్ ఫారెస్ట్ ఉందన్నారు. దీంతో అటవీ ప్రాంతంలో ఉన్న ఎలుగుబండ్లు, పందులతో పాటు చిరుతలు గ్రామం వైపు వచ్చేవన్నారు. ఆ సమయంలో మనుషులు, జీవాలపై దాడి చేస్తే ప్రమాదం కూడా ఉండేదన్నారు. యోగానంద్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.